ప్రజాశక్తి
సోమవారం 29 మే 2023
5
పార్వతీపురం మన్యం

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకుల సందడి చేశారు. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించారు. యువత హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. జలవిహార వద్ద బోటు షికారు చేశారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి సరదాగా ఆడుకున్నారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెరలు కొట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

మినీ ట్రైన్ ఎక్కి సందడి చేస్తున్న చిన్నారులు

- నిధుల్లేక నీరసించిన ఏజెన్సీ ప్రాంత సంస్థ
- ఏడాదిన్నరైనా పత్తాలేని పాలకవర్గ సమావేశం
- ఎక్కడి సమస్యలు అక్కడే
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి పట్టదా?

ఐటిడిఎ ఉంటుందా? ఊడుతుందా?

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లాలో రెండు ఐటిడిఎల్లో పార్వతీపురం ఐటిడిఎ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అసలు ఈ ఐటిడిఎ ఉంటుందో ఊడుతుందో తెలియని అయోమయ స్థితి కనిపిస్తోంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయింది. ఇంతవరకు ఒకేసారి పాలకవర్గ సమావేశం 2021 డిసెంబర్ 24న జరిగింది. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పుష్పశ్రీవాణి ఉన్న సమయంలో ఈ సమావేశం నిర్వహించారు. ప్రతి మూడు నెలల కొకసారి నిర్వహించాల్సిన సమావేశం ఏడాదిన్నరైనా పత్తాలేని పరిస్థితి ఏర్పడింది. జిల్లా నుంచి విడిపోయిన తర్వాత ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలో సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎలు వున్నాయి. ఒకే జిల్లాలో ఒకే ఐటిడిఎ ఉండాలనే నిబంధనలు ఉన్న నేపథ్యంలో ఈ రెండింటిలో ఏది మనుగడలో ఉంటుందనేది ప్రశ్నార్థకమైంది. గిరిజన ఉప ప్రణాళిక మండలాల్లోని గిరిజన సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ఈ సంస్థ పని చేయాల్సి ఉంది. అయితే ఆ దిశగా ఐటిడిఎలో కార్యక్రమాలు జరగడం లేదు. పరిపాలన మొక్కుబడిగా కొనసాగుతోంది. గిరిజన సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. తమ సమస్యలు చెప్పుకుందామని గిరిజన ఎమ్మెల్యేలు, జెడ్పిటీసీలు, ఎంపిపిలు భావిస్తున్నా పాలకవర్గ సమావేశం నిర్వహించడం లేదు.

ఉత్సవ విగ్రహంగా పిఒ

గతంలో మాదిరిగా ఐటిడిఎలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరగకపోవడంతో ప్రాజెక్టు అధికారికి చేతినిండా పని లేకుండా పోయింది. ప్రాజెక్టు అధికారిగా ఐఎఎస్ అధికారి ఉన్న సంస్థకు పూర్వవైభవం ఎప్పుడొస్తుందో తెలియని స్థితిలో గిరిజనులు వున్నారు. గిరిజన యువతకు ట్రైకార్ ఉపాధి రుణాలు, పిటిజి తెగల గిరిజనులకు వందశాతం సబ్సిడీతో ఉపాధి రుణాలు గత ప్రభుత్వం హయాం వరకు మంజూరవుతుండేవి. ప్రస్తుత ప్రభుత్వం హయాంలో నవరత్నాలనే సంక్షేమ పథకాలు తప్ప మరో కార్యక్రమం జరగడం లేదు. గిరిజన యువతకు ఉపాధి శిక్షణ ఇవ్వడానికి ఐటిడిఎ పరిధిలో రెండు వైటిసిలు ఉన్నాయి. గడచిన నాలుగేళ్లుగా వైటిసిలో ఎటువంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం లేదు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 13.9శాతం సవర, 9.44శాతం గదబ తెగల గిరిజనులు వున్నారు. వీరు పిటిజి తెగలు పరిగణిస్తారు. గిరిజన తెగలన్నింటిలో అత్యంత వెనుకబడిన గిరిజన తెగలుగా పిటిజి తెగలను భావిస్తున్నారు. గిరిజన సమస్యల పరిష్కారానికి వారం వారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్ మొక్కుబడిగా జరుగుతోంది. గతంలో ఐటిడిఎ పిఒ సమక్షంలో ప్రాజెక్టు కార్యాలయంలోనే గ్రీవెన్స్ సెల్ నిర్వహించే వారు. కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత ఐటిడిఎ పిఒ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ సెల్ లోనే హాజరవుతున్నారు.

వెంటాడుతున్న నిధుల కొరత

ఐటిడిఎను తీవ్రమైన నిధుల కొరత వెంటాడుతోంది. ఫలితంగా ప్రాజెక్టు అధికారి అప్పటికప్పుడు పరిష్కరించాల్సిన చిన్న చిన్న సమస్యలకూ నిధుల కొరత ఎదురవుతోంది. నిధుల కొరత ఇంత తీవ్రంగా ఉండడానికి ప్రధాన కారణం గతంలో పనిచేసిన ఐటిడిఎ పిఒ కూర్మనాథ్ తనకు మాలిన ధర్మమేనని ప్రచారం జరుగుతోంది. మన్యం జిల్లా ఏర్పడిన నాటికి ఐటిడిఎ పిఒగా కూర్మనాథ్ పని చేస్తున్నారు. కొత్త జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అవసరాల కోసం అప్పటి పిఒ కూర్మనాథ్ ఐటిడిఎ నిధులు రెండు కోట్ల రూపాయలను జిల్లా కలెక్టర్‌కు అప్పగించినట్లు తెలుస్తోంది. మన్యం జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా తానే ఉంటాననే ఆశతో ఆయన అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు చేశారనే వాదనలు అప్పట్లో వినిపించాయి. దీని ఫలితంగా ఐటిడిఎ లో నిధుల లేమి తీవ్రమైంది.

గిరిజన మంత్రికి పట్టదా?

వైసిపి ప్రభుత్వ హయాంలో ఒకే ఒకసారి ఐటిడిఎ పాలకవర్గ సమావేశం జరిగింది. ఏడాదిన్నరవుతున్నా పాలకవర్గ సమావేశం నిర్వహించకపోవడంపై గిరిజన సంఘాలు, ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా, డిప్యూటీ సిఎంగా రాజన్నదొర బాధ్యతలు చేపట్టి ఏడాది దాటింది. ఆయన హయాంలో ఒకసారి కూడా పాలకవర్గ సమావేశం నిర్వహించకపోవడం చర్చనీయాంశమైంది. తమ ప్రభుత్వం గిరిజన పక్షపాతి అని పదేపదే చెపుతున్న రాజన్నదొర మౌనం వహిస్తుండడం చర్చనీయాంశమైంది. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రాజన్నదొర అనేక సందర్భాల్లో గత ప్రభుత్వం హయాంలో పాలకవర్గ సమావేశం నిర్వహించడం లేదని విరుచుకుపడ్డారు. ఒకవేళ పాలకవర్గ సమావేశం నిర్వహిస్తే గిరిజన ప్రజాప్రతినిధులు సమస్యలు లేవనెత్తే అవకాశం ఉంటుంది. ఆ సమస్యలు పరిష్కరించాలంటే నిధులు వుండాలి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యే పరిస్థితి లేదు. ఐటిడిఎలోనూ నిధుల్లేవు. ఇలాంటి పరిస్థితుల్లో పాలకవర్గ సమావేశం నిర్వహించడం కన్నా వాయిదా వేయడమే ఉత్తమమని అధికారపార్టీ ఎమ్మెల్యేలు, మంత్రి భావిస్తున్నట్లు తెలుస్తోంది.

మరో మైలురాయి దాటిన మన్యం జిల్లా

ఆశావహ జిల్లాకు రూ.3 కోట్లు అదనపు కేటాయింపులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

పార్వతీపురం మన్యం జిల్లా మరో మైలు రాయిని చేరుకుంది. నీతి అయోగ్ వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ఆశావహ జిల్లాలను ఎంపిక చేయడం, అందులో ఈ జిల్లాను చేర్పించారు. అప్పటి నుంచి నీతి ఆయోగ్ పొందుపరచిన శీర్షికలు (థీమ్) - వైద్య ఆరోగ్య, విద్యా, వ్యవసాయం, నైపుణ్య అభివృద్ధి, ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పనా రంగంలో అభివృద్ధికి జిల్లా యంత్రాంగం అనేక చర్యలు చేపట్టింది. జిల్లాలో ప్రాథమిక, మౌలిక సదుపాయాల కల్పనా రంగంలో భాగంగా మొబైల్ టవర్ల కల్పన, మారుమూల ఆవాసాలకు పిఎంజిఎస్‌వైకింద రహదారుల నిర్మాణం, గ్రామాల్లో ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తేవడం, గృహ నిర్మాణాలు వేగవంతం చేయడం తదితర పనులు చేపడుతుంది. దీంతో అతి తక్కువ సమయంలో నీతి అయోగ్ ప్రశంసలు అందుకుంది. ఆశావహ జిల్లాల్లో ప్రాథమిక మౌలిక సదుపాయాలు కల్పనా రంగంలో జాతీయ స్థాయిలో మంచి స్థానాన్ని సాధించి రూ.3 కోట్ల అదనపు నిధుల కేటాయింపు పొందింది. ఈ మేరకు నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి వి.రాధ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమాచారం అందించారు. ఆశావహ జిల్లాల పనితీరును ఆయా రంగాల్లో నీతి ఆయోగ్ నిర్దేశించిన సూచికల ఆధారంగా ర్యాంకులను నిర్ణయిస్తారు. 2022 డిసెంబరు నాటికి ఉన్న ప్రగతిని ఆధారంగా చేసుకుని ర్యాంకులను నిర్ణయించారు. ఇందులో ప్రాథమిక మౌళిక సదుపాయాల రంగంలో మంచి ర్యాంకును సాధించిందని అదనపు కార్యదర్శి తెలిపారు. ప్రగతి, ర్యాంకు ఆధారంగా అదనంగా రూ.3 కోట్ల నిధులు కేటాయింపునకు అర్హత సాధించిందని, అందుకు తగిన ప్రతిపాదనలు, కార్యాచరణ ప్రణాళిక రూపొందించి జూన్ 15 నాటికి సమర్పించాలని సూచించారు. ప్రతిపాదనలను ఆశావాహ జిల్లాల ఎంపవర్డ్ కమిటీ పరిశీలిస్తుందని ఆమె పేర్కొన్నారు. అదనపు కార్యదర్శి జిల్లా బృందానికి శుభాకాంక్షలు తెలపడంతో పాటు, చక్కటి సేవలు అందిస్తున్నందుకు జిల్లా కలెక్టర్ సర్వీసు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. మొబైల్ టవర్ల ఏర్పాటుపై ఇటీవల ట్విట్టర్‌లో నీతి ఆయోగ్ ట్వీట్ చేస్తూ ప్రశంసించడం జరిగిన సంగతి తెలిసిందే. సుదూర ప్రాంతాల ప్రజల మొబైల్ కనెక్టివిటీకి జిల్లా యంత్రాంగం చేస్తున్న కషిని మెచ్చుకోవడం జరిగింది.

ఏజెన్సీలో మొబైల్ కనెక్టవిటీ చేసిన సందర్భంగా గిరిజనులతో కలెక్టర్ నిశాంత్‌కుమార్ (ఫైల్)

సంతోషంగా ఉంది : కలెక్టర్

ఆశావహ జిల్లాగా పార్వతీపురం మన్యం జిల్లాను చేర్చడం, నిర్దేశించిన అంశాల్లో ప్రగతి సాధించడం, అందులో మంచి ర్యాంకు సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. ఇందులో భాగస్వామ్యమైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేస్తున్నారని ప్రశంసించారు. జాతీయ స్థాయి గుర్తింపులో ఎండా వానల్లో సైతం శ్రమిస్తు గృహ నిర్మాణాలు చేస్తున్న ప్రతి కూలి, ప్రతి మేస్త్రి, లబ్దిదారులు భాగస్వామ్యం ఉందని ఆయన పేర్కొన్నారు. మొబైల్ టవర్ల ఏర్పాటుకు స్థలాల పరిశీలనలో భాగస్వామ్యమైన విఆర్ఒ నుండి ఉన్నత అధికారుల వరకు, ఇంజనీరింగ్ సహాయకులు నుంచి ఎఇ తదితరుల పాత్ర మరువలేనిదని అన్నారు. ఈ గౌరవం దక్కడంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ, ఎంపిటిసిల సహకారానికి అభినందనలు తెలిపారు. విద్యాశాఖ, పోలీస్ శాఖ తదితర శాఖల తోడ్పాటు ఎంతగానో ఉపకరించిందని అన్నారు. ఒక్కమాటలో ఈ గౌరవం "కార్మికులది" అన్నారు.

ఘనంగా ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు శత జయంతోత్సవాలు ఆదివారం టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో జరిగాయి. తొలుత పార్టీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఎన్టీయార్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదల గుండెల్లో వెలుగులు నింపారని అన్నారు. తెలుగు భాష ఉన్నంత వరకు ఆయనది సుస్థిర స్థానమని కొనియాడారు. కార్యక్రమంలో మండల పట్టణ పార్టీ అధ్యక్షులు జి.రవికుమార్, డి.మోహన్‌రావు, కౌన్సిలర్లు టి.వెంకట్రావు, కోలా మధు, సరిత, బడే గౌరినాయుడు, నాయకులు కోల వెంకటరావు, జాగాన రవికుమార్, ధనుంజయ, జి.రామ్మూర్తి, పాలకొండ రాజశేఖర్, సిరిపురపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలో ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నర్సిపురం పంచాయతీ కార్యాలయ ఆవరణ లో గల ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ వైస్ ఎంపిపి గొట్టాపు గౌరి, వెంకటరావు పూలమాలలు వేసి నివాళు లర్పించుగా, స్థానిక నాయకులు చుక్క జయప్రకాష్ పాల్గొన్నారు. అలాగే తాళ్లబురిడిలో మాజీ సర్పంచ్ బేత లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళు లర్పించారు.

ఎన్టీయార్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న టిడిపి నాయకులు

జాతీయ అవార్డుకు జోగింపేట

ప్రజాశక్తి - పార్వతీపురం

జాతీయ అవార్డుకు సీతానగరం మండలం జోగింపేట పంచాయతీ ఎంపికైంది. ఈ మేరకు పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నుండి వర్తమానం అందింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా జూన్ 5న న్యూ ఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో జరిగే వేడుకల్లో పంచాయతీలకు అవార్డులు ఇవ్వనున్నారు. పచ్చదనం, పరిశుభ్రత (క్లీన్ అండ్ గ్రీన్) విభాగంలో జోగింపేట పంచాయతీ ఎంపికైంది. రాష్ట్రంలో మూడు పంచాయతీలు పచ్చదనం, పరిశుభ్రత (క్లీన్ అండ్ గ్రీన్) విభాగంలో ఎంపిక కాగా వాటిలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బిల్లనందూరు, నెల్లూరు జిల్లా కడలూరు ఉన్నాయి. జోగింపేట పంచాయతీ సర్పంచ్ కల్యంపూడి సింహాచలం నేతృత్వంలో శత శాతం బహిరంగ మలవిసర్జన లేని పంచాయతీగా, తాగు నీటి సరఫరా, పచ్చదనం, మురుగునీరు పారుదల - పారిశుధ్యం, పౌష్టికాహారం విధానాలు పాటించడం, సుపరిపాలన, వీధి దీపాలు ఏర్పాటు వంటి చర్యలు చేపట్టారు. జోగింపేట గ్రామ పరిధిలో 540 మొక్కలు నాటి పచ్చదనం కల్పించడంతో పాటు, ఆహ్లాదకర వాతావరణం తీసుకురావడంలో సఫలీకతులయ్యారు. జాతీయ అవార్డుకు ఎంపిక పట్ల కలెక్టర్ నిశాంత్ కుమార్ అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని పంచాయతీలు అవార్డులు సొంతం చేసుకోవాలని కోరారు. అన్ని రంగాల్లో ప్రగతి సాధించి ఆయా రంగాల్లో అందించే అవార్డులు పొందేందుకు పోటీ పడాలని ఆయన స్ఫూర్తిని ఇచ్చారు. జిల్లా గ్రామ పంచాయితీ అధికారి బలివాడ సత్యనారాయణ మాట్లాడుతూ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో అనేక గ్రామ పంచాయితీలు పచ్చదనం, పరిశుభ్రత దిశగా ముందున్నాయన్నారు.

గంగాడలో దాహం కేకలు

స్పందించని అధికారులు
ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని గంగాడలో గత నెల రోజులుగా మంచినీరు సౌకర్యం లేక స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామ మహిళలంతా ఆదివారం ఖాళీ బిందెలతో నడిరోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గ్రామంలో సర్పంచ్ వేరే ప్రాంతంలో ఉండడం వల్ల గ్రామంలో ముఖ్యమైన, సమస్యలు ఆయన దృష్టికి చేరకపోవడంతో ఇటువంటి సమస్యలు ఎక్కువసార్లు తలెత్తుతున్నాయని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. స్థానికంగా ఉన్న దళితుడైన ఎంపిటిసి డర్రు శంకర్రావు అనేకసార్లు అధికారులకు ఈ విషయంపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గంగాడలో ప్రధానమైన సమస్యలు ఎన్ని ఉన్నా స్థానికంగా సర్పంచ్ ఉండకపోవడంతో ఈ సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా గ్రామంలో పారిశుధ్యం పేరుకుపోయి చెత్తాచెదారం, పెరిగి దోమల కారణంగా గ్రామంలో ప్రజలు అనారోగ్యం పడే బాధితులు ఎక్కువమంది ఉన్నారని రోడ్లపైకి మురికి నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తుల చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు ఆ గ్రామంలో మంచినీరందించి, మిగతా సమస్యలను యుద్ధ పాతిపదికన పరిష్కరించాలని తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై 'ప్రజాశక్తి' ఎంపిడిఒను వివరణ కోరగా, తక్షణమే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను గ్రామానికి పంపి తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఖాళీ బిందెలను నిరసన తెలుపుతున్న మహిళలు

గిరిజన సంఘం మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాంలో జూన్ 16, 17 తేదీల్లో జరగనున్న గిరిజన సంఘం 7వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానికఎపి గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివారం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. గిరిజనులకు వెన్నుముకగా ఉన్న జిఒ 3 రద్దు చేశారని, 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ బాక్సైటు కంపెనీల పేరుతో గిరిజనులను అడవి నుంచి వెళ్లగొట్టేందుకు ఈ ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని విమర్శించారు. తరతరాల నుంచి గిరిజనులు అడవినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నా నేటి వరకు చాలామందికి పోడు పట్టాలు అందని పరిస్థితి ఉందన్నారు. పీసా చట్టం పటిష్టంగా అమలు కావడం లేదన్నారు. పోరాట ఫలితంగా సాధించుకున్న ఐటిడిఎ, జిసిసి సంస్థల ద్వారా గిరిజనులకు ఎపి గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలక అవినాష్ మాట్లాడుతూ నేటికీ గిరిజన మారుమూల గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, వైద్య సేవలు మెరుగుపడలేదన్నారు. గర్భిణీలు, వృద్ధులను డోలీల సాయంతో వైద్యం కోసం తీసుకొస్తున్న గిరిజనుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదన్నారు. నూతన విద్యా విధానం పేరుతో పాఠశాలలను ఎత్తివేసి గిరిజన విద్యార్థులను చదువుకు దూరం చేశారని అన్నారు. గిరిజనులంతా ఐక్యంగా ఉండి హక్కులు, చట్టాల రక్షణకై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. పోరాటాల ద్వారానే హక్కుల సాధనకై వీలుంటుందని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా గిరిజన సంఘం మహాసభలకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మేధావులు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, మండల అధ్యక్ష కార్యదర్శులు బిడ్డిక శంకరరావు, పువ్వల తిరుపతిరావు, యువజన సంఘం నాయకులు పువ్వల మోహన్‌రావు, మండల నాయకులు బిడ్డిక ఆడిత్, ఎం.సన్యాసిరావు, బిడ్డిక సత్యం తదితరులు ఉన్నారు.

పాచిపెంట: మండలంలోని కర్రివలస పంచాయతీ మూలవలసలో గిరిజన సంఘం మండల కార్యదర్శి మంచాల శ్రీనివాసరావు, నాయకులు కొర్ర జోగులు, కొర్ర హరి, చౌడిపల్లి బోస్ ఆధ్వర్యంలో గిరిజన సంఘం 7వ జిల్లా మహాసభల వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ మహాసభలకు గిరిజనులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు.

కొమరాడ : గిరిజన సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని గిరిజన సంఘం నాయకులు ఎల్.బాబురావు పిలుపునిచ్చారు. మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ కొమరాడ మండలం గుమ్మడి సంతలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు, గిరిజనులు శ్రీను, రాము, సీతయ్య, లక్ష్మణరావు, వెంకటేష్, సుబ్బారావు, చింతామణి తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : మండల కేంద్రంలో జూన్ 16, 17 తేదీల్లో జరగనున్న గిరిజన సంఘం జిల్లా మహాసభలకు తరలి రావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని నీలకంఠాపురం, నాయుడుగూడ గిరిజన గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజనతో మాట్లాడుతూ గిరిజన హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ మహాసభలు చూసి వణుకు పుట్టేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు .

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

పిఎసిఎస్‌ల బలోపేతానికి కృషి

- తక్కువ వడ్డీ రేట్లకు రైతులకు, మహిళలకు రుణాలు
- 2022-23లో రూ.174 కోట్ల వ్యవసాయ రుణాలు
- జిల్లాకు 80 గోదాములు కేటాయింపు

ప్రజాశక్తితో జిల్లా సహకార అధికారి బి.సన్యాసినాయుడు ముఖాముఖి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) బలోపేతానికి కృషి చేస్తున్నట్లు జిల్లా సహకార అధికారి బి.సన్యాసినాయుడు తెలిపారు. రైతులకు, మహిళలకు వ్యవసాయం, వ్యాపారం అభివృద్ధి కోసం తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు అందజేస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయ రుణాలు రూ.174కోట్లు అందజేయనున్నట్టు తెలిపారు. జిల్లాకు మొదటి దశలో 22 గోదాములు, రెండో దశలో 48 గోదాములు కేటాయింపు జరిగాయని చెప్పారు. వీటితో జిల్లా సహకారశాఖ చేపడుతున్న కార్యక్రమాలను ఆయన 'ప్రజాశక్తి' ముఖాముఖికి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే...

-ప్రజాశక్తి, కలెక్టరేట్

? జిల్లాలో ఎన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పిఎసిఎస్) ఉన్నాయి?

జిల్లాలో 43 వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 42 సంఘాలు ప్రస్తుతం చురుగ్గా అన్ని కార్యకలాపాలుకొనసాగుతున్నాయి. ఈ సహకార సంఘాల ద్వారా రైతులకు, మహిళా సంఘాలకు రుణ సదుపాయం కల్పిస్తున్నాం. రైతులకు తక్కువ వడ్డీకే రుణ సదుపాయం కల్పించి, సులభ పద్ధతిలో రుణమందేలా చర్యలు తీసుకుంటున్నాం.

? జిల్లాలో ఇప్పటి వరకూ రైతులకు ఎంత మొత్తం రుణాల అందించారు?

2022-23 సంవత్సరానికి గానూ జిల్లాలో రైతులకు వ్యవసాయ రుణాల కోసం రూ.174 కోట్లు రుణాలు ఇవ్వడం జరిగింది. స్వల్పకాలిక రుణాల కోసం రూ.349 కోట్లును, స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.92 కోట్లు రుణాలను అందించడం జరిగింది.

? సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

సహకార సంఘాలను బలోపేతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. రైతుల పంటను, ఎరువులను నిల్వ ఉంచడం కోసం మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్లను నాబార్డు వారు ఎఐఎఫ్ (అగ్రికల్చర్ ఎన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) ద్వారా 25 నుండి 50 సెంట్లు స్థలం సేకరించి, 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను రూ.40 లక్షల వ్యయంతో నిర్మించబోతున్నారు. ఈ మొత్తంలో 90శాతం నాబార్డు ద్వారా, 10శాతం వాటా రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. దీని ద్వారా రైతుల పంటలు, ఎరువులకు ఎటువంటి నష్టం కలగకుండా గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకోవచ్చు.

? మన జిల్లాకు ఎన్ని గోదాములు కేటాయించారు?

జిల్లాకు మొదటి దశలో 22 గోదాములను కేటాయించారు. ప్రస్తుతానికి ఈ గోదాములు నిర్మాణ దశలో ఉన్నాయి. రెండవ దశలో 48 గోదాముల నిర్మాణానికి కలెక్టర్ ఆధ్వర్యంలో స్థల సేకరణ జరిగింది. తదుపరి వాటి నిర్మాణాల కోసం మార్కెటింగ్ ఇంజనీరింగ్ శాఖ తనిఖీ చేసి టెండర్లు పిలవడం జరుగుతుంది.

? పిఎసిఎస్ సేవల మెరుగుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?



కేంద్ర, రాష్ట్రప్రభుత్వ సహకారంతో పిఎసిఎస్‌లన్నీ కంప్యూటరైజ్డ్ చేయాలని, దీని ద్వారా రైతులకు అందించే సేవలు పారదర్శకంగా జరగాలని, దీని ద్వారా పిఎసిఎస్ అన్నీ మినీబ్యాంకులుగా మారే అవకాశం ఉంది. సహకార సంఘాల ద్వారా కామన్ సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేసి ఈ సేవ కేంద్రాల వల్లే ఆన్లైన్ సర్వీసులను గ్రామాల్లో అందించేలా ప్రయత్నం జరుగుతుంది. రాబోయే కాలంలో రైతులు సాంకేతికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

జిల్లాలో సహకార సంఘాల ద్వారా ఏఏ పంటలు కొనుగోలు చేస్తున్నారు?

జిల్లాలో 42 సహకార సంఘాల ద్వారా 1.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. ఈ కొనుగోలుకు గానూ సుమారు రూ.నాలుగు కోట్లు కమిషన్ పొందడం జరిగింది. అలాగే ఈ ఏడాది జిల్లాలోని ఆరు సంఘాల ద్వారా 1200 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న సేకరించడం జరిగింది.

పిఎసిఎస్‌ల పట్ల రైతుల అవగాహనకు ఎటువంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?

కేంద్ర సహకార సంఘం ఆధ్వర్యంలో సహకార వారోత్సవాలను ఏడాదికి రెండుసార్లు సహకార సంఘాల ద్వారా రైతుల్లో అవగాహన చేపట్టడం జరుగుతుంది. దీన్ని రైతులకు వ్యవసాయ రుణ సదుపాయాలపై అవగాహన కల్పిస్తున్నాం.

కరపత్రాలను అందజేస్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కురుపాం

ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. ఆదివారం జియ్యమ్మవలస మండలం టికె జమ్ము పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి తెలియజేసి ఇంకా సమస్యలు ఏమైనా ఉంటే వాలంటీర్లకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం. శశికళ, మండల ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో మండలంలోని పెదభోగిలిలో మూడో రోజున గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన ప్రజల వద్దకు వెళ్లి వారికి ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలన్నీ సరిగ్గా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగి ఎవరైనా అర్హులు ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణ పట్ల ఎస్ఐకు అభినందనలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని ఇటీవల వివిధ గ్రామాల్లో ఇటీవల జరిగిన గ్రామదేవతల పండగలు ప్రశాంతంగా నిర్వహించేందుకు శాంతిభద్రతల పరిరక్షణలో కృషి చేసిన స్థానిక ఎస్ఐ ఎస్.ప్రశాంత్‌కుమార్‌ను గ్రామస్తులు అభినందించారు. మండలంలోని సుభద్ర, మిర్తివలస, బర్లి, తుమరాడ, వెంగాపురం తదితర గ్రామాల్లో ఇటీవల గ్రామదేవతల పండగలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఈ పండగల్లో ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు స్థానిక ఎస్ఐ పై స్థాయి అధికారుల సలహాలతో, స్థానిక నాయకుల సహకారంతో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా పండగను పక్కాగా నిర్వహించారు. ఈ మేరకు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామ పెద్దలు మెచ్చుకొని అభినందించారు.

సంతోష్ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వేణు

సంతోష్ కుటుంబానికి సిపిఎం జిల్లా కార్యదర్శి పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

ప్రజాశక్తి దినపత్రికలో యాడ్స్ విభాగంలో పనిచేస్తున్న జి.సంతోష్‌కుమార్ తల్లి సుశీల శనివారం మృతి చెందారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు సంతోష్‌కుమార్ స్వగ్రామమైన అంటిపేట వెళ్లి సుశీల మృతదేహం వద్ద నివాళ్లు అర్పించి సంతాపం తెలిపారు. అలాగే ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు అంటిపేట వెళ్లి సుశీల మృతదేహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. సంతోష్ కుటుంబానికి సానుభూతి తెలిపారు. సంతోష్‌ను పరామర్శించిన వారిలో ప్రజాశక్తి సిబ్బంది సిహెచ్.రాము, రాజేష్, సిపిఎం నాయకులు రెడ్డి రమణమూర్తి, రెడ్డి ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

శిక్షణ పొందుతున్న చిన్నారులు

వేసవి క్రీడా శిక్షణకు స్పందన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర క్రీడా ప్రాథమిక సంస్థ ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం హెచ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న వేసవి అథ్లెటిక్స్ క్రీడా శిక్షణ శిబిరానికి విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ సందర్భంగా క్రీడా శిక్షకుడు బంగారి రామకృష్ణ మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులు కాలాన్ని వృథా చేయకుండా ఉండేందుకు అథ్లెటిక్స్ విభాగంలో క్రీడా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి 40మంది విద్యార్థులు క్రీడా శిక్షణ పొందుతున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్యాంకర్ నుంచి నీరుపడుతున్న మహిళలు

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పైపులైన్లు మరమ్మతులకు గురి కావడంతో గత వారం రోజులుగా పార్వతీపురం మండలం వెంకంపేటలో నీటి సరఫరా సక్రమంగా జరగకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. స్పందించిన సర్పంచ్ తీళ్ల కష్ణారావు ఆదివారం అద్దె ట్యాంకర్ల ద్వారా గ్రామంలో నీటి సరఫరా నిర్వహించారు.

ఇప్పలపోలమ్మ పండగకు రూ.30 వేలు విరాళం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం గ్రామ దేవత ఇప్పల పోలమ్మ పండగను పురస్కరించుకొని ఆదివారం టిడిపి నాయకులు మజ్జి కృష్ణమోహన్ (మజ్జి బ్రదర్స్)తరపున రూ.30వేలు నగదును అమ్మవారి పండగ నిర్వాహక సభ్యులు మంత్రి రవికుమార్ అందజేశారు. పండగను తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కృష్ణమోహన్ కోరారు.


విరాళాన్ని అందజేస్తున్న మజ్జి కృష్ణమోహన్

కనుమరుగవుతున్న పేదోడి ఫ్రిజ్

వేసవిలో ఎండల తీవ్రతకు మనిషికి దాహం వేసినప్పుడు సరాసరి వెళ్లేది మంచినీటి కుండవద్దకే. అందుకే మట్టికుండను పేదవాని ఫ్రిజ్ అంటారు. నేటి ఆధునిక సమాజంలో మట్టికుండ కనుమరుగైపోతుంది. ఈ వృత్తిపై ఆధారపడిన కుమ్మర్ల జీవితాలు అగమ్యగోచరంగా తయారయ్యాయి. వేసవి వచ్చిందంటే మట్టి కుండలకు చాలా గిరాకీ ఉండేది. కుమ్మర్లు కుండలు తయారు చేసి ఆర్థికంగా కొంత బలపడేవారు. వేసవిలో సంపాదించుకున్న డబ్బులు ఏడాది పాటు వాడుకుంటూ వర్షాకాలం, చలికాలంలో కూలీ నాలి చేసుకుంటూ జీవనం సాగించేవారు. గతంలో పేద, మధ్యతరగతి ప్రజలతో పాటు ఉన్నత వర్గాలకు చెందిన వారు కూడా మట్టి పాత్రలపై మక్కువ చూపేవారు. మార్కెట్లోకి ప్లాస్టిక్ వస్తువులు, వాటర్ క్యాన్లు, ఫ్రిజ్‌లు విరివిగా రావడంతో మట్టి కుండల వాడకం కాలక్రమేనా తగ్గిపోతుంది.

- మట్టి దొరక్కపోవడమే కారణం
- ఉపాధి కూలీలుగా మారుతున్న వైన్యం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న కుమ్మర్లు

ప్రజాశక్తి - కురుపాం

మట్టి కుండలో ఉండే నీరు చల్లగా, రుచికరంగా ఎంతో దాహాన్ని తీరుస్తాయి. నేడు మట్టి కుండలు కొనేనాథుడే కరువయ్యారు. మట్టి కుండలకు గిరాకీ ఉండే వేసవిలో కూడా అంతంతమాత్రంగా కుండలు కొనుగోలు ఉండడంతో ఈ వృత్తిపై ఆధారపడిన ఎన్నో కుమ్మరిల కుటుంబాలు జీవితాలు ఆగమ్యా గోచరంగా మారాయి. ప్రభుత్వం ఈ వత్తిదారులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వం ఆదుకోకపోవడం వల్ల కులవత్తులు నేడు కనుమరుగవుతున్నాయి. చేతి వృత్తుల పనివారిని ప్రోత్సహించి వారి వృత్తులు కనుమరుగు కాకుండా చూడాల్సిన బాధ్యత ఎంతో ఉంది. లేకుంటే మట్టికుండ అని బొమ్మల ద్వారా రాబోయే తరాలకు చూపించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కావాల్సిన బంకమట్టి గతంలో దొరికేది. నేడు ఉన్న మట్టిని కూడా ఎక్కడపడితే అక్కడ గృహ నిర్మాణాలకు, లేఔట్లకు తరలించడం వల్ల మట్టి కూడా కరువవుతోంది. కుమ్మర్లు మట్టికుండల తయారీకి కావాల్సిన మట్టి దొరక్కపోవడంతో చేసేదిలేక నేడు చాలా మంది ఉపాధి కూలీలుగా మారారు.

ఆరకొరగా చలివేంద్రాలు

ఎండాకాలం వచ్చిందంటే చాలా మంది ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, ప్రజలు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో మట్టికుండలతో ఉప్పు బానులతో మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు గతంలో ఎక్కడపడితే అక్కడ చలివేంద్రాలు ఉండేవి. ప్రస్తుతం ఎక్కడో ఆరా కోరాగా తప్ప చలివేంద్రాలు జాడే పెద్దగా కనిపించడం లేదు. మట్టి కుండల తయారీ గతంలో కంటే నేడు కొంత తగ్గింది. ఎందుకంటే కుండలు కొనే వారి సంఖ్య గణనీయంగా తగ్గడంతో చేసేవారు కూడా కుండలు అమ్ము పోకపోవడంతో ఈ కుండల తయారీకి మొగ్గు చూపకపోవడం గమనార్హం.

కుండలకు కొన్నిచోట్ల గిరాకీ

అమ్మకానికి సిద్ధంగా ఉన్న కుండలు

మట్టి కుండలకు కొన్ని చోట్ల గిరాకీ బాగుంటుంటోంది. మట్టి కుళాయి కుండ రూ. 250 నుంచి 350, సాధారణ కుండ రూ. 150 నుండి 350, హుండీ రూ.50, పూల కుండి రూ.150, మట్టి ప్రమిదలు, మూకుళ్లు, ఇతర మట్టి సామగ్రిని కుమ్మరిలే తయారుచేసి మొండెంఖల్, నీలకంఠాపురం, కురుపాం సంతల్లోకి తెచ్చుకొని అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొనేవారు వస్తే అమ్ముడుపోతే నాలుగు రూపాయలు తమకు వస్తుందని, అమ్ముడుపోకపోతే ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ కొనుగోలుదార్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని కుమ్మరిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మట్టి పాత్రల వాడకం తగ్గింది

మట్టితో తయారు చేసిన పాత్రలు వాడకం బాగా తగ్గింది. గతంలో మట్టి కుండలకు వ్యాపారం బాగా ఉండేది. 20ఏళ్లుగా మట్టి కుండల తయారీ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాను. రానురాను వ్యాపారం తగ్గుముఖం పడుతుంది. ప్రస్తుతం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం కావున ప్రభుత్వం కులవృత్తి చేసే వారందరికీ ఆర్థిక సాయం అందించాలి.

డి.త్రినాథ్,
మట్టి కుండల తయారీదారుడు, జి.శివడ.

ట్రోఫీని గెలుచుకున్న కొండవాడ జట్టు సభ్యులు

వడ్డంగి ప్రీమియర్ లీగ్ విజేత కొండవాడ

ప్రజాశక్తి - భామిని

మండలంలోని వడ్డంగిలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డంగి ప్రీమియర్ లీగ్ క్రికెట్‌లో జిల్లాలోని వివిధ మండలాల నుండి 30 జట్లు పాల్గొన్నాయి. గత వారం నిర్వహించిన లీగ్‌లో ఆదివారం కొండవాడ, కిచ్చాడ గ్రామ జట్ల మధ్య ఆఖరి ఉత్కంఠ పోరులో కొండవాడ ప్రీమియర్ లీగ్ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా శ్రీను బాబు మాట్లాడుతూ ఇలాంటి టోర్నమెంట్ నిర్వహణ వల్ల ప్రాంతాల మధ్య దూరం తగ్గి, స్నేహ భావం పెరుగుతుందని, యువ్వనంలో క్రీడలు ఆడడమంటే భవిష్యత్తు ఆరోగ్యం పదిలం చేసుకోవడమేనని తెలిపారు. ఈ లీగ్‌లో విజేతగా నిలిచిన కురుపాం మండలం కొండవాడ జట్టు కెప్టెన్ పవన్‌కు ట్రోఫీతో పాటు రూ.15వేలు నగదు బహుమతిని వైసిపి సీనియర్ నాయకులు శ్రీనుబాబు, సర్పంచ్ కొండగొర్రి ఉషారాణి, గోపాల్ దాస్ అందజేశారు. రన్నర్‌గా నిలిచిన కిచ్చాడ గ్రామ క్రికెట్ జట్టు కెప్టెన్ సాయికి రూ.10వేలు నగదు బహుమతితో పాటు రన్నర్ ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

అసమ్మతి గ్రూపు నుంచే ఎక్కువ మంది

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గం పరిధిలో టిడిపి అసమ్మతి గ్రూపునకు చెందిన నాయకులే మహానాడుకు ఎక్కువ బస్సుల్లో కార్యకర్తలను, అభిమానులను తరలించారు. నియోజకవర్గ ఇంఛార్జి సంధ్యారాణి వ్యతిరేక గ్రూపులో కీలకమైన పాచిపెంట మండల పార్టీ అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు సొంత ఖర్చులతో ఒక బస్సులో టిడిపి కార్యకర్తలను, అభిమానులను మహానాడుకు తరలించారు. అలాగే మక్కువ మండలం నుంచి పెంట తిరుపతిరావు రెండు బస్సుల్లో తన అనుచరులను పంపించారు. మెంటాడ మండలం నుంచి కూడా అక్కడి కార్యకర్తలు స్థానిక నాయకులు సొంత ఖర్చులతో బస్సు వేసుకుని మహానాడుకు బయలు దేరినట్లు తెలుస్తోంది. నియోజకవర్గ ఇంఛార్జి హోదాలో ఉన్న సంధ్యారాణి అనుచరులు ఒకేఒక బస్సులో మహానాడుకు వెళ్లడంపై చర్చనీయాంశమవుతోంది. సాలూరు పట్టణం, మండలం, పాచిపెంట మండలాలకు చెందిన ఆమె

మహానాడుకు వెళ్లిన టిడిపి అసమ్మతి గ్రూపు నాయకులు, కార్యకర్తలు

అనుచరులంతా ఒకే బస్సులో హాజరయ్యారు.

పార్టీ లో నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి మద్దతుదారుల కన్నా ఆమె వ్యతిరేకులుగా ఉన్న నాయకులే రాజకీయాలను ప్రభావితం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇదిలా వుండగా పాచిపెంట మండల అద్యక్షుడ్ని నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి మార్చినప్పటికీ పార్టీ రాష్ట్ర నాయకత్వం దృష్టిలో పిన్నింటి ప్రసాద్‌బాబే అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కొద్దిరోజుల క్రితం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడ్ని సంధ్యారాణి తన అనుచరులతో కలిసిన సందర్భంగా ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేసినట్లు తెలిసింది. మండల పార్టీ అధ్యక్షుడ్ని పార్టీ రాష్ట్ర నాయకత్వం మార్చలేదని, మార్పు చేసే అధికారం నియోజకవర్గ ఇన్చార్జికి లేదని ఆయన స్పష్టంగా చెప్పారనే వాదనలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ పార్టీలో చాపకింద నీరులా ఇంఛార్జి వ్యతిరేక గ్రూపు విస్తరిస్తోంది.

కంపుకొడుతున్న ఆర్‌టిసి కాంప్లెక్స్

ప్రజాశక్తి- పాలకొండ

పాలకొండ ఆర్‌టిసి కాంప్లెక్స్ పూర్తిగా కంపుకొడుతుంది. పూర్తిగా అధికారుల నిర్వహణ బాధ్యతులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజుకు వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ కాంప్లెక్స్‌లో అసౌకర్యాలు నెలవుగా ఉన్నాయి. కనీసం కూర్చోడానికి కుర్చీలు కూడా పూర్తిస్థాయిలో లేవు. మరుగుదొడ్లు నిర్వహణ అధ్వాన్నంగా ఉంది. వాడుకనీరు లేకపోవడంతో మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ప్రయాణికులు మలమూత్ర విసర్జనకు ఇబ్బందులు తప్పడం లేదు. కనీసం తాగునీటి కుళాయి వద్ద కూడా శుభ్రత పాటించడం లేదు. కుళాయి నీరు పూర్తిగా వృధాగా వదిలేయడంతో ఆ నీరు వృధాగా బయటకు పోతుంది. దీంతో ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్‌టిసి కాంప్లెక్స్ అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

వృథాగా పోతున్న తాగునీరు

చంద్రబాబును కలిసిన జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

టిడిపి జాతీయ పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడును కురుపాం నియోజకవర్గం ఇంచార్జి తోయక జగదీశ్వరి ఆదివారం కలిసినట్లు ఆమె తెలిపారు. రాజమహేంద్రవరంలో జరుగుతున్న రెండో మహానాడు సభ వేదిక వద్ద చంద్రబాబును కలిసి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి, చేస్తున్న కార్యక్రమాలు, సభ్యత్వలను నమోదు వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె చెప్పారు. కష్టపడి పని చేస్తే రానున్న రోజుల్లో మంచి ఫలితం ఉంటుందని, 2024 ఎన్నికల కోసం మరింత కష్టపడాలని అధినేత సూచించినట్లు ఆమె తెలిపారు.

చంద్రబాబుతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

పాతబిల్లులు ఇస్తారా? : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

గత టిడిపి ప్రభుత్వం హయాంలో నిర్మించుకున్న ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు ఇస్తారా? ఇవ్వరా అని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. మండలంలోని చినఖేర్జల పంచాయతీ సీశాడవలసలో గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నిర్మించి వదిలేసిన ఇళ్లను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంబమూర్తి మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఎవరైతే ఇళ్లు కట్టుకున్నారో వాళ్లందర్నీ ప్రస్తుత వైసిపి ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా గాలికి వదిలే పరిస్థితి ఉందని అన్నారు. నాలుగేళ్లయినా ఒక్క పైసా కూడా లబ్ధిదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలో 1200 మంది వరకు లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత బిల్లులు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన, వ్యవసాయ కార్మికసంఘాల నాయకులు కె.సంగమ్మ, రెడ్డి శివున్నాయుడు ఉన్నారు.

నేడు వైసిపి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - సాలూరు

ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఇటీవల పేదల ఇళ్ల స్థలాలపై చేసిన వ్యాఖ్యలు నిరసిస్తూ సోమవారం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని డిప్యూటీ సీఎం రాజన్నదొర పిలుపునిచ్చారు. చంద్రబాబుతో సహా పచ్చమీడియా ప్రభుత్వ వ్యతిరేక రాతలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన చెప్పారు. ఆదివారం పట్టణ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సిఎంగా జగన్ మోహన్ రెడ్డి ప్రమాణం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం బోసు బొమ్మ జంక్షన్‌లో సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కృష్ణమూర్తిని సన్మానిస్తున్న జగన్నాధపురం గ్రామ పెద్దలు, యువత

సేవామూర్తికి సన్మానం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ పరిధిలో గల జగన్నాధపురంలో ఎర్ర కంచమ్మ తల్లి అమ్మవారి పండగ సందర్భంగా పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్లో పని చేయుచున్న హెడ్ కానిస్టేబుల్, వృద్ధమిత్ర కో-ఆర్డినేటర్ కె.కృష్ణమూర్తికి ఆయన చేసిన సేవలకు గాను గుర్తించి ఆదివారం జగన్నాధపురం గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, యువత సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఆయన సేవలకు అభినందనలు తెలిపి మెమోంటోను అందజేశారు.

రైతులకు పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వేలో భాగంగా గుమ్మలక్ష్మీపురం పంచాయతీలో 150 ఎకరాల్లో భూమి రీ సర్వే చేపట్టినట్లు సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు తెలిపారు. ఆదివారం భూ రీ సర్వేలో 50 మంది గిరిజన రైతులకు కొత్తగా పట్టాల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, వీఆర్వో బోడమ్మ తదితరులు ఉన్నారు.

కళింగ వైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ ప్రధాన రహదారిలో ఉన్న కళింగ వైశ్య శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆదివారం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది.కళింగ వైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు అందవరపు కోటేశ్వరరావు ముఖ్య అతిథిగానూ, ప్రముఖ డాక్యుమెంట్ రైటర్ బెలగాం జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. గౌరవ అధ్యక్షులుగా సంకా ఈశ్వరరావు, అధ్యక్షులుగా బరాటం వెంకటరమణ, దేవస్థాన చైర్మన్ వూన్న భాస్కర్ రావు (బుజ్జి), కార్యదర్శిగా కెంగువ సత్యనారాయణ (రాజు), కోశాధికారిగా పొట్నూరు గౌరీశంకర్రావు, కోరాడ లక్ష్మీకాంత్, కన్వీనర్‌గా కోరాడ మధుసూదనరావు (సతీష్), దేవస్థాన సెక్రెటరీగా సంక కిషోర్‌కుమార్, ఉపాధ్యక్షులుగా గెంబలి బాలమురళి, కోటన రమేష్, పట్నాన సాయికిరణ్, జాయింట్ సెక్రెటరీగా సంకా మల్లికార్జునరావు, బరాటం శ్రీనివాసరావు, ఈసీ సభ్యులైన వైశ్యరాజు శ్రీనివాసరావు తదితరు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

శిక్షణ పొందుతున్న చిన్నారులు

చెరువులపై చిన్న చూపు తగదు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

చెరువులపై చిన్న చూపు తగదని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వి.దాలినాయుడు అన్నారు. ఆదివారం ఆ సమితి పట్టణ అధ్యక్షులు శిగడం భాస్కర రావుతో కలిసి మండలంలోని వెంకంపేట సమీపంలో ఉన్న ఎంకమ్మ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చెరువుల పరిరక్షణలో చిన్న చూపు చూస్తోందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించి, జల చక్రాన్ని కాపాడి, భూగర్భ జలాలను అభివృద్ధి చేసి, మానవాళితో పాటు జలజీవ రాశులన్నింటికీ ప్రాణాధారమైన నీటినందిస్తున్న చెరువులను ప్రభుత్వం పరిరక్షించాలన్నారు. ప్రస్తుతం చెరువులు అక్రమార్కుల చెరలో పడి కబ్జాకు గురవుతున్నాయన్నారు. పలు చెరువుల్లో పక్కా భవనాలు నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. పలు చెరువులను కప్పివేస్తూ లేఅవుట్లుగా మార్చుతున్నారన్నారు. అయినా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆవేదన చెందారు. మరి కొద్ది రోజుల్లో వర్షాలు కురిసే సమయానికి జిల్లాలోని చెరువుల నిండా నీరు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి ఆయా చెరువులకు సంబంధించిన మధుములు, కానాలు, చప్టాలు, షట్టర్లు తదితర వాటికి మరమ్మతులు చేపట్టాలన్నారు. అలాగే ఎక్కడైనా చెరువుగట్లు బలహీనంగా ఉంటే వాటిని బలంగా తీర్చిదిద్దాలన్నారు.

మరమ్మతులకు గురైన నడుకూరు-కిమ్మి రహదారి

నాణ్యతకు తిలోదకాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరు నుంచి కిమ్మికి వెళ్లే రహదారి మరమ్మతుల పనులు నాణ్యత ప్రమాణాలు లోపించాయి. పనులు జరిగినప్పుడు అధికారుల పర్యవేక్షణ లోపించడంతో మరమ్మతులకు గురయ్యాయి. పనులు జరిగి నెలలు రాకముందే మళ్లీ రహదారి శిథిలావవస్థకు చేరుకుందంటే అధికారుల పర్యవేక్షణ ఏ విధంగా ఉందో వీటిని చూస్తే అర్థం చేసుకోవచ్చు.

వర్షాలకు బురదమయమైన చిదిమి-పివిఆర్‌పురం రోడ్డు

చినుకు పడితే చిత్తడే

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమి- పివిఆర్ పురం గ్రామాల మధ్య రహదారి చినుకు పడితే చిత్తడిగా మారింది. ఇటీవల కురుస్తున్న అడపాదడప వర్షాలకు ప్రధాన రహదారి బురదమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతిసారి వర్షం పడిన ఇదే పరిస్థితి ఏర్పడుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి రహదారి అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.